విద్యారణ్యపురలో నేడు ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరం

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు విద్యారణ్యపురం బీఈఎల్ లేఅవుట్‌లో గల షిర్డీ సాయిబాబా మందిర సేవా ట్రస్టు ఆవరణలో గురువారం ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కర్ణాటక క్యాన్సర్ సొసైటీ నగరంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సాయి సేవా చికిత్సాలయ సహకారంతో సఖి మహిళా వైద్యుల విభాగం, సీజీపీ ఐఏపీ యలహంక సహకారంతో ఏర్పాటు చేస్తున్నారు. శిబిరంలో స్తన క్యాన్సర్, గర్భకోశ క్యాన్సర్ పరీక్షలతో పాటు ఉచిత వైద్యసలహాలు కూడా లభిస్తాయని, ఉదయం 9 గంటలకు నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

మహాశివరాత్రికి భారీ ఏర్పాట్లు

ప్రముఖ శైవక్షేత్రాలకు తరలిరానున్న భక్తులు
పండుగ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు



ధర్మస్థళం ఆలయం వద్ద సిద్ధమవుతున్న ఏర్పాట్లు ఇలా..


శివోహం శివాలయం

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం కోసం రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో భారీగా ఏర్పాట్లు సాగుతున్నాయి. శుక్రవారం శివరాత్రిని పురస్కరించుకుని ప్రముఖ ఆలయాలలో ఉత్సవాలు, జాతరలు, ప్రత్యేక పూజలు, రుద్ర హోమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీలు సిద్ధమయ్యాయి. ప్రముఖ ఆలయాలైన బెంగళూరులోని గవిగంగాధరేశ్వర ఆలయ జాతరకు సర్వం సిద్ధం చేశారు. వందలాది దుకాణాలు వెలిశాయి. ఉదయం నుంచే పూజలు ఉంటాయని అర్చకులు ప్రకటించారు. ఇక మల్లేశ్వరంలోని కాడుమల్లేశ్వర ఆలయ జాతరకోసం ఏర్పాట్లు సాగుతున్నాయి. రథాన్ని సిద్ధం చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సందర్శనకోసం ఇబ్బందులు తలెత్తకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. హెచ్ఏఎల్‌లోని శివోహం ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం దాకా నిత్య పూజలు, భజనలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చామరాజనగర జిల్లాలో వెలసిన మలె మహదేశ్వర ఆలయానికి కర్ణాటక నుంచే కాకుండా తమిళనాడు నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. లక్షలాదిమంది మాదప్ప దర్శనానికి వస్తారని అంచనా వేసి అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం రెండు రోజులుగా మలె మహదేశ్వర కొండపై మకాం వేసి కసరత్తు చేస్తోంది. దక్షిణకాశిగా ఖ్యాతిగాంచిన నంజనగూడు శ్రీకంఠేశ్వర ఆలయం సర్వం సిద్ధమైంది. మైసూరు సమీపంలోని నంజనగూడులో శివరాత్రి పర్వదినాన రుద్రహోమాలు జరిపే సంప్రదాయం దశాబ్దాలుగా ఉంది. ఆలయ దర్శనానికి పెద్దఎత్తున భక్తులు వస్తుంటారు. అందుకు అనుగుణంగానే బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయానికి సమీపంలో ఉండే నదిలో స్నానానికి వెళ్లేవారికోసం ముందస్తు జాగ్రత్తలు సూచిస్తున్నారు. ఉత్తరకన్నడ జిల్లాలోని పవిత్ర శైవక్షేత్రాలైన గోకర్ణ మహాబలేశ్వర ఆలయంలో రామచంద్రాపుర పీఠాధిపతి రాఘవేశ్వరస్వామిజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. అరేబియా సముద్రతీరంలో అత్యంత ఎత్తున ఉండే శివుడి రూపం మురుడేశ్వరలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడికి కర్ణాటకతో పాటు గోవా నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. దక్షిణకన్నడ జిల్లాలోని ధర్మస్థళ మంజునాథస్వామి ఆలయ ధర్మకర్త వీరేంద్రహెగ్డే ఆధ్వర్యంలో శివరాత్రికి ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆలయానికి వచ్చే భక్తుల కోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళూరులోని ఖాద్రి మంజునాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలకు కసరత్తు చేస్తున్నారు. కోలారు జిల్లాలోని కోటి లింగాలు, సోమేశ్వర ఆలయాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. నంది కొండలకు అనుబంధంగా వెలసిన భోగనందీశ్వర ఆలయంలో యామపూజలు నిర్వహించనున్నారు. చిక్కబళ్లాపుర పట్టణానికి సమీపంలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ఆదియోగి ప్రాంగణంలో నిరంతర కార్యక్రమాలకు ఏర్పాట్లు సాగుతున్నాయి. బెంగళూరు చామరాజపేటలోని మలెమహదేశ్వర ఆలయంలో పూజలు జరిపించేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఏటా వస్తుంటారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నగర వ్యాప్తంగా జాగరణ కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించనున్నారు. జనసంస్కృతి ప్రతిష్ఠాన, కావ్యమండల ఆధ్వర్యంలో కావ్య శివరాత్రి పేరిట అహోరాత్రి కావ్యగాయన నిర్వహించనున్నారు.

శివోహం శివాలయంలో 24 గంటలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 8న నగరంలోని పాత ఎయిర్‌పోర్టు రోడ్డులో గల శివోహం శివాలయంలో భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు ఆలయ పాలక మండలి నగరంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఈ శివాలయంలో 24 గంటల పాటు నిరంతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. 65 అడుగుల ఎత్తయిన భవ్యమైన శివుడి విగ్రహం, 32 అడుగుల గణేశుడి విగ్రహాన్ని ఉత్సవాల సందర్భంగా అందంగా అలంకరించనున్నారు. అమరనాథయాత్ర అనుభవం, 12 జ్యోతిర్లింగాలు, నవగ్రహాలు ఈ ఆలయంలో భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా ఉన్నాయి. యజ్ఞయాగాదుల కోసమే 6 అడుగుల ఎత్తయిన యజ్ఞకుండాన్ని కూడా ఇక్కడ ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి వేళ ప్రతి రెండు గంటలకోసారి పరమశివుడికి హారతి ఇవ్వనున్నారు. రాత్రి జాగరణ కూడా భజనలు కీర్తనలతో అత్యంత శోభాయమానంగా ఉంటుందని ఆలయ సంస్థాపకుడు ఆత్మ ఇన్ రవి వెల్లడించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉండడంతో ఈ మేరకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. శివోహంలో జరిగే మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొని శివుడి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.


మురుడేశ్వర


మాలే మహదేశ్వర

సిట్టింగుల్లో గుబులు

11 మంది బీజేపీ ఎంపీలకు టిక్కెట్ డౌటే.. తొలి జాబితా నిబంధనలతో ఆందోళన

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేడి రాజుకుంటోంది. బీజేపీ తొలి జాబితాలో రాష్ట్రానికి సంబంధించి కేటాయింపులు లేకపోవడంతో రెండో జాబితాలో దాదాపు ఖరారయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్రానికి సంబంధించిన టిక్కెట్ల ఖరారుపై చర్చించినట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లోనే జాబితా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. రాష్ట్రంలో 28 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా ప్రస్తుతం 25 మంది బీజేపీ ఎంపీలు ఉన్నారు. మండ్య ఇండిపెండెంట్ ఎంపీ సుమలత కూడా మద్దతు ఇస్తున్నారు. ఇక కాంగ్రెస్, జేడీఎస్ చెరొక స్థానంలో ఉన్నారు. బీజేపీ తొలి జాబితాలో పలు నిబంధనలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఏకంగా కేంద్రమంత్రులను సైతం పక్కన పెట్టారు. రాష్ట్రంలోనూ ఇదే పరిణామం కొనసాగుతుందనే ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా బీజేపీ టిక్కెట్ల ఖరారులో వయసు పైబడినవారు, అనారోగ్యం, ప్రజా వ్యతిరేకత, నియోజకవర్గంపై పట్టు లేకపోవడం, మాటలగారడీతో కొనసాగేవారితోపాటు తరచూ వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేది లేదని ప్రకటించుకున్నవారిని పక్కనపెట్టారు. ఈ లెక్కన రాష్ట్రంలోని 26 మంది సిట్టింగ్ ఎంపీలలో 11 మందికిపైగా టిక్కెట్లు దక్కవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర నియోజకవర్గాల వారీగా పరిశీలకులు, ముఖ్య కార్యకర్తలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జిల్లాలవారీగా పార్టీ సీనియర్ల ద్వారా ఒక జాబితాను సిద్ధం చేసి అధిష్టానానికి ఒకటి రెండు రోజుల్లోనే ఢిల్లీ నేతలకు అప్పగించే అవకాశం ఉంది. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌కు కేరళ రాష్ట్రం తిరువనంతపురం అభ్యర్థిగా ప్రకటించారు. కేంద్ర కేబినెట్‌లో కీలకమైన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్‌ను రాష్ట్రం నుంచి పోటీ చేయించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వరుసగా బీజేపీ అభ్యర్థులు గెలుపొందుతున్న నియోజకవర్గాలను వీరికి కేటాయించే అవకాశం ఉంది. గడిచిన నెలన్నర కాలంగా కేంద్రమంత్రి జైశంకర్ రాష్ట్రంలోనే పర్యటించడం వెనుక అధిష్టానం సూచనగా తెలుస్తోంది. దక్షిణకన్నడ జిల్లా మంగళూరు, బెంగళూరు దక్షిణ నియోజకవర్గాలను కేంద్రమంత్రులకు కేటాయిస్తారనే ప్రచారం సాగుతోంది. రాష్ట్రంలో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాదే తుది నిర్ణయంగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయన బృందాలు నాలుగుసార్లకుపైగా సర్వేలు చేసినట్టు తెలుస్తోంది. జేడీఎస్‌తో పొత్తు ఖరారు కావడంతో వారికి 3-4 సీట్లు కేటాయించే అవకాశం ఉంది. వాటిని మినహాయించి మిగిలిన స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేస్తారు. జేడీఎస్ నేత కుమారస్వామిని లోక్‌సభ స్థానానికి పోటీ చేయించి కేంద్రంలో క్రియాశీలకం చేయాలని అగ్రనేతలు భావిస్తున్నట్టు తెలుస్తోంది. వారంలోగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, కుమారస్వామి ఢిల్లీ వెళ్తున్నారు. ఒకేసారి ఇద్దరితో చర్చలు జరిపి అన్ని నిర్ణయాలు ప్రకటించనున్నట్టు తెలుస్తోంది. బీజేపీ ఎంపీలలో శ్రీనివాస్ ప్రసాద్, బచ్చేగౌడ, కేంద్రమంత్రి నారాయణస్వామి పోటీ చేసేది లేదని ప్రకటించారు. ఇక సీనియర్ నేత సదానంద గౌడ, దావణగెరె సిద్దేశ్వర్, శివకుమార్ ఉదాసి, అనంతకుమార్ హెగ్డే సహా పలువురికి టిక్కెట్లు అనుమానమే అనిపిస్తోంది. ఈ స్థానాల్లో కొత్తవారిని నియమించే కసరత్తు కూడా అంతర్గతంగా సాగుతోంది. తాజాగా విజయపుర ఎంపీ రమేశ్ జిగజిణగి వయోభారంతోపాటు ఆరోగ్య సమస్యలు ఉన్న మేరకు ఆయనను తప్పిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. దక్షిణభారత్‌లో కర్ణాటకపైనే ఆశలు పెట్టుకున్న బీజేపీ ఎక్కువస్థానాలు గెలుపొందేందుకు కసరత్తు సాగిస్తోంది.





లక్ష్మణసవదికి త్వరలో కీలక బాధ్యతలు

ముఖ్యమంత్రి సిద్దరామయ్య


బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ తీరుతో విసిగివేసారి కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నేత లక్ష్మణ్ సవదికి త్వరలో కీలక బాధ్యతలు అప్పగించబోతున్నట్టు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. బుధవారం బెళగావి జిల్లా పర్యటనలో భాగంగా అథణిలో రూ.1500 కోట్లతో చేపట్టిన ఎత్తిపోతల పథకాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా అథణి తాలూకాలో 95 శాతం అంటే 50వేల ఎకరాలకు నీటి సదుపాయం లభించనుందని తెలిపారు. బీజేపీ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి కేంద్రముందు మోకరిల్లారని మండిపడ్డారు. ఈ విషయంలో పొరుగున ఉన్న తమిళనాడును చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. కరువు సాయం విడుదలలోగానీ, రాష్ట్ర గ్రాంట్ల విడుదలలోగానీ, జీఎస్టీ వాటా విషయంలోగానీ, నీటి పారుదల ప్రాజెక్టుల విషయంలోగానీ బీజేపీ ఎంపీలు మౌనవ్రతం దాల్చడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే అంశంపై ప్రజలు నిలదీయడం ఖాయమన్నారు. అప్పర్‌కృష్ణ, అప్పర్‌భద్ర, మహదాయి, మేకెదాటు ప్రాజెక్టుల విషయంలో కేంద్రం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. 25 మంది బీజేపీ ఎంపీలను గెలిపించి పంపినా రాష్ట్రానికి సాధించింది శూన్యమని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం నిరుపేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికశక్తికి పుష్టి చేకూరుస్తుంటే వీటిని బీజేపీ వ్యతిరేకిస్తూ నాలుగున్నరకోట్ల లబ్ధిదారులను అవమానిస్తోందన్నారు. ఉద్వేగభరిత అంశాలతో ఎన్నాళ్లు రాజకీయం చేస్తారని ప్రశ్నించారు. ప్రజల జీవితాలతో ఆటలాడుకోవడం మానుకోవాలని బీజేపీకి హితవు పలికారు. తన బెళగావి జిల్లా పర్యటనలో భాగంగా సీఎం పలు కార్యక్రమాలను ప్రారంభించడంతోపాటు మరికొన్నింటికీ శంకుస్థాపన చేశారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సతీశ్‌జార్కిహొళి, స్త్రీశిశుసంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీపాటిల్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య
సమావేశానికి హాజరైన ప్రజలు

5, 8, 9, 11 తరగతుల

బోర్డు పరీక్షలు రద్దు

నిర్వహించొద్దని హైకోర్టు తీర్పు




బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 5, 8, 9, 11వ తరగతులకు రాష్ట్రస్థాయి పబ్లిక్ పరీక్షలను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. స్టేట్ సిలబస్ కల్గిన నాలుగు తరగతులకు (బోర్డు) పబ్లిక్ పరీక్షలు జరుపుతామని రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా కొన్ని నెలల కాలంగా కసరత్తు సాగించింది. ఈనెల 13 నుంచి ఫైనల్ పరీక్షలు జరగాల్సి ఉంది. అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ విద్యాసంస్థల ఐక్య కూటమి హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. బుధవారం విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ రవిహొసమని తీర్పు ప్రకటించారు. రాష్ట్ర విద్యాశాఖ విద్యాచట్టానికి అనుగుణంగా 2023 అక్టోబరు 6, 9 తేదీలలో ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి ప్రభుత్వ విద్యాసంస్థలు పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు అనుగుణమైన ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ ప్రైవేట్ విద్యాసంస్థల కూటమి మాత్రం అభ్యంతరం వ్యక్తం చేస్తూ వచ్చింది. కొవిడ్ తర్వాత విద్యార్థుల్లో నైపుణ్యత తగ్గిందని, పబ్లిక్ పరీక్షల పేరిట ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదని అభ్యంతరం పేర్కొంది. పరీక్షలు నిర్వహించడమే గానీ మౌల్యమాపన తర్వాత ఫలితాలు ప్రకటించేది ఉండదని కూడా ఒకానొక సందర్భంలో ప్రభుత్వం తెలిపింది. అయినా రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వులపై ప్రైవేట్ విద్యాసంస్థల కూటమి అభ్యంతరం చెప్పింది. విద్యాశాఖ తరపున వాదించిన న్యాయవాది విద్యార్థుల్లో నైపుణ్యత పెంచాలని, సిలబస్‌కు అనుగుణంగానే ప్రశ్నపత్రాలు ఉంటాయని వివరించారు. విద్యార్థులలో మేథోశక్తి సకారాత్మకంగా పెంపొందించే దిశగా పరీక్షలు నిర్వహించదలిచామన్నారు. పరీక్షలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఐక్యకూటమి తరపున న్యాయవాదులు కేవీ ధనంజయ్, అనిరుద్ ఎ. కులకర్ణి వాదించారు.

అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద

సైన్స్ సిటీ

మంత్రి ఎన్ఎస్ బోసరాజు వెల్లడి



బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్లిలోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపాన సైన్స్ సిటీ ఏర్పాటు కానుందని శాస్త్ర, సాంకేతిక, చిన్నతరహా నీటి పారుదల శాఖల మంత్రి ఎన్ఎస్ బోసరాజు తెలిపారు. బెంగళూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సైన్స్ సిటీ ఏర్పాటుకు అవసరమైన 25 ఎకరాల స్థలాన్ని అంతర్జాతీయ విమానాశ్రయ సమీపంలోని ఆది నారాయణ హొసహళ్లి పారిశ్రామికవాడలో కేటాయించామన్నారు. దేశంలో ప్రస్తుతం మూడు సైన్స్‌సిటీలు ఉన్నాయన్నారు. దక్షిణభారతదేశంలో తొలి సైన్స్‌సిటీ బెంగళూరులోనే ఏర్పాటు కానుండడం మరో విశేషమన్నారు. ఇందులో భారతీయ విజ్ఞానమందిరం, రామన్ పరిశోధనా సంస్థ విభాగం, 400కు పైగా పరిశోధనలకు వీలు కల్పించే ల్యాబొరేటరీలు, ఐటీ బీటీ పార్క్ ఉంటాయన్నారు. కేంద్రప్రభుత్వం ఈ సైన్స్‌సిటీకి సానుకూలంగా స్పందించి అనుమతులు మంజూరు చేసిన అనంతరం ముఖ్యమంత్రి సిద్దరామయ్య బడ్జెట్‌లో నిధులను కేటాయించారని వివరించారు. అతి త్వరలోనే సైన్స్ సిటీ ప్రజలకు అందుబాటులోకి రానుందన్నారు. రానున్న రోజుల్లో ఇదొక ప్రముఖ పర్యాటక కేంద్రంగా వెలసిల్లనుందని అభిప్రాయపడ్డారు.

బీజేపీ హయాంలో...

ఆరుసార్లు బాంబు పేలుళ్లు

రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి



బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేవలం ఒక్కసారి బాంబు పేలుడు సంభవించిందని గత బీజేపీ ప్రభుత్వాల హయాంలో ఏకంగా ఆరుసార్లు బాంబు పేలుళ్లు సంభవించాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఆర్. రామలింగారెడ్డి ఆరోపించారు. నగరంలో బుధవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. బాంబుపేలుళ్ల ఘటనపై ప్రభుత్వం తక్షణం స్పందించి చర్యలు చేపట్టిందని అయినా దీనిని శాంతి భద్రతల సమస్యగా చూపుతూ బీజేపీ రాజకీయం చేస్తోందని విరుచుకుపడ్డారు. యడియూరప్ప సీఎంగా ఉన్న సమయంలో 2010 ఏప్రిల్ 10న చిన్నస్వామి క్రికెట్ స్టేడియం వద్ద బాంబు పేలుళ్లు జరిగాయని, జగదీశ్ శెట్టర్ సీఎంగా ఉన్న సమయంలో మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయం వద్ద, బసవరాజ్ బొమ్మై సీఎంగా ఉన్న సమయంలో మంగళూరులో కుక్కర్ బాంబు పేలుళ్లు సంభవించాయని మంత్రి గుర్తు చేశారు. 2008లోనూ వరుస బాంబు పేలుళ్ల ఘటన సమయంలోనూ బీజేపీ రాష్ట్రంలో అధికారంలో ఉందన్నారు. ఈ ఘటనల ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు గతంలో తాము ఎన్నడూ ప్రయత్నించలేదని, ప్రతిదాన్నీ బీజేపీ రాజకీయం చేస్తోందని ఆయన ప్రకటనలో మండిపడ్డారు. గతంలో పుల్వామా దాడి ఘటనను కూడా లోక్‌సభ ఎన్నికల ప్రచారాస్త్రంగా చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ప్రజలను ప్రధాన సమస్యల నుంచి దారితప్పించేందుకే ఇలాంటి ఉద్వేగ పూరిత అంశాలను బీజేపీ ప్రస్తావిస్తోందన్నారు. బీజేపీ కుట్రలను రాజకీయంగానే ఎదుర్కొంటామన్నారు.

జాతీయ ఉద్యానమేళాలో పెర్‌ఫెక్ట్ స్టాల్

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): హెసరఘట్టలోని జాతీయ ఉద్యాన పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యానమేళాలో పెర్‌ఫెక్ట్ స్టాల్ ఆకట్టుకుంటోంది. మొక్కల ఎదుగుదల, రోగ నివారణకు దోహదపడే పెర్‌ఫెక్ట్ ఉత్పత్తులకు జాతీయస్థాయిలో ఆదరణ ఉంది. క్రాఫ్ట్ పెర్‌ఫెక్ట్ సంస్థ అన్నదాతలు సాగు చేసే అన్ని పంటల ద్వారా ఆదాయం పొందేలా ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తోంది. ఉద్యానమేళాకు రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి ఉద్యాన రైతులు జాతీయస్థాయిలో శాస్త్రవేత్తలు, పరిశోధకులు, సాంకేతిక పరికరాల తయారీ కంపెనీల ప్రతినిధులు భాగస్వాములయ్యారు. పెర్‌ఫెక్ట్ స్టాల్‌ను రైతులతోపాటు అన్నివర్గాలు ఆసక్తిగా తిలకిస్తున్నాయని సంస్థ వ్యవస్థాపకులు బీఎస్ మూర్తి తెలిపారు.



మేళాలో ఏర్పాటు చేసిన పెర్‌ఫెక్ట్ స్టాల్



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.02	1,602.74
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1212	8,031
సామర్థ్యం (టీఎంసీలు)	8.01	25.27

శ్రీశైలానికి శివమాలధారులు



ఇరుముడితో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న మాలధారులు

సిరుగుప్ప, మార్చి 6: సిరుగుప్ప తాలుకాలోని శివ మాలధారణ భక్తులు 41 రోజుల దీక్ష అనంతరం బుధ వారం శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. ప్రధానంగా 24వ వార్డులోని ఉమామహేశ్వరాలయంలో పూజలు చేసి ఇరు ముడి కట్టుకుని ప్రదక్షిణచేసి తమ యాత్రను ప్రారంభిం చారు. అంతకుముందు ఆలయం వద్ద అన్నదాన కార్యక్ర మాన్ని నిర్వహించారు. వేలాది మంది పట్టణ ప్రజలు వీరి సేవల్లో పాల్గొన్నారు.

వ్యవసాయ బీఎస్సీలో బంగారు పతకం ప్రదానం



బళ్లారి సిటీ, మార్చి 6: బెంగళూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం స్నాతకోత్సవంలో బుధవారం బళ్లారి తాలూకా శంకరబండే గ్రామానికి చెందిన కే.సౌమ్యకు గవర్నర్ గెహ్లాట్, వ్యవసాయశాఖ మంత్రి ఎన్.చలువరా యస్వామి బంగారు పతకం, సర్టిఫికేట్ అందజేశారు.

ఘనంగా సుంకులమ్మ కుంభ మహోత్సవం

సిరుగుప్ప, మార్చి 6: తాలుకాలోని షానవాసపుర గ్రామంలో సుంకులమ్మ దేవి కుంభ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కుంభ మహోత్సవాల కార్యక్ర మంలో బీజేపీ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు ఎంఎస్ సిద్దప్ప పాల్గొని సుంకులమ్మ దేవిని దర్శించుకున్నారు. కుంభ మహోత్సవాల కార్యక్రమానికి తాలుకా నలుమూ లల నుంచి భక్తులు తరలివచ్చారు.

విజయనగర వర్సిటీ వీసీగా మేత్రి



వీసీకి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఇన్‌చార్జి

బళ్లారి సిటీ, మార్చి 6: విజయనగర విశ్వవిద్యా లయం వైస్ ఛాన్సిలర్‌గా హంపి కన్నడ విశ్వవిద్యా లయం, గిరిజన అధ్యయన విభాగం ప్రొఫెసర్ మేత్రిని నియమించినట్లు గవర్నర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వవిద్యాలయంలో బుధవారం ఇన్‌చార్జి ప్రొఫె సర్ విజయకుమార్ బి.మాలశెట్టి కొత్త వీసీకి బాధ్య తలు అప్పగించారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నజనార్దనరెడ్డి

గంగావతి రూరల్, మార్చి 6: గంగావతి తాలూకా జంగ్లీరాంపూర్ గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మిం చిన అంగన్‌వాడీ పాఠశాలను ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు జన్మనిస్తే గురు వులు జ్ఞానాన్ని పెంపొందిస్తారన్నారు. ప్రతి చిన్నారి అంగ న్‌వాడీ పాఠశాల నుంచి ప్రారంభమై ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. విద్యతోనే దేశం అభివృద్ధి చెందు తుందన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించి మంచి విద్యబోధనలు నేర్పాలన్నారు. ఈసందర్భంగా గ్రామపంచాయితీ అధ్యక్షులు శ్రీనివాస్ పత్తార్, శిశుఅభి వృద్ధి శాఖ ప్రవీణ్‌కుమార్, ఈరమ్మ, గంగప్ప రాథోడ్, ఆనంద్, విశ్వనాథ్‌పాటిల్, బాబురెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బళ్లారిలో 92,316 బోగస్ ఓట్లు

● బీజేపీ నేతల ఆరోపణ



బీజేపీ ప్రణాళిక సంకల్ప పత్రాన్ని విడుదల చేస్తున్న ప్రముఖులు

బళ్లారి సిటీ, మార్చి6 : జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోకవర్గాల పరిధిలో 92,316 మంది బోగస్ ఓటర్లు ఉన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేయనున్నట్లు బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా తెలిపారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంప్లి నియోజకవ ర్గంలో 14,563మంది, బళ్లారి సిటీలో 14,563మంది, బళ్లారి రూరల్ లో 18,769 మంది, సిరుగుప్పలో 23,970 మంది, సండూర్ నియోజకవర్గంలో 15,400 మంది బోగస్ ఓటర్లు ఉన్నారన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.5లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టినా, రాష్ట్రాభివృ ద్ధికి కేవలం బడ్జెట్‌లో 52వేల కోట్లు మాత్రమే కేటాయిం చిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అనేది లేకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీధులో నడవలేరన్నారు. కార్యక్రమంలో విధానపరిషత్ సభ్యులు వైఎం.సతీశ్ హేమ లత, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, చంద్రు, మహిళా విభాగం అధక్షురాలు సుగుణ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పరిసరాలను కాపాడుదాం

● బుడా అధ్యక్షుడు ఆంజనేయులు

బళ్లారి సిటీ, మార్చి 06: ప్రతి ఒక చెట్టు ఎంతో విలువ కలిగినదని బుడా అధ్యక్షులు ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక రాఘవేంద్రకాలనీ ఆదర్శ ఉద్యానవనం అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. రెండవ సారి బుడా అధ్యక్షుడు కావడానికి బళ్లారి ప్రజల ఆశీస్సులే కారణమన్నారు. రానున్న వర్షకాలంలో ప్రతి ఇంటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతానన్నారు. మనిషి పుట్టుక, చావు తప్పద న్నారు. పుట్టిన మనిషి ప్రాణాలను చెట్లు కాపాడుతాయన్నారు. మరణించిన వారికి శ్మశానానికి వెళ్లడం తప్పనిసరి అని, రుద్రభూమి ప్రాంతాలలో కాంపౌండ్, బోరునీరు, దేవాలయం ఏర్పాటుకు కృషిచేస్తానని తెలిపారు. నగ రంలోని ఉన్న పార్కుల అభివృద్ధికి పూనుకున్నామన్నారు. అనంతరం ఆదర్శ ఉద్యానవన అభివృద్ధి సంఘం అధ్యక్షుడు కరెకోడప్ప మాట్లాడుతూ బళ్లారి నగ రంలో హెచ్ ఆర్ గవియప్ప సర్కిల్, ఇందిరా సర్కిల్‌తో పాటు పార్కులను కూడా అంజనేయులు అభివృద్ధి చేశారన్నారు. రెండోసారి బుడా అధ్యక్షుడు కావడం సంతోషకరమన్నారు. మరల బళ్లారి అభివృద్ధికి అంజనేయులు తిరిగి వచ్చారని కొని యాడారు. బళ్లారి సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్‌లో ఏరూరు గ్రామంలో జన్మించి బళ్లారి నగరంలో యూత్ కాంగ్రెస్ నాయకుడిగా అడుగుపెట్టినప్పటి నుంచి పార్టీని నమ్ము కుని సేవలు అందించడం వల్లనే ఈస్థానం దక్కిందని కొనియాడారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ వివేక్ విక్కి, కార్పొరేటర్ ముల్లంగి నందీశ్, జేడియస్ అధ్యక్షులు మీనళ్లి తాయన్న, మాజీ బుడా అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, ఆదర్శ ఉద్యానవనం అభివృద్ధి సంఘం పదాధి కారులు సురేశ్‌గౌడ, జీ.నాగరాజు, నెట్టకల్లప్ప, కల్లం కిశోర్ లతో పాటు 40సభ్యులు, కాంగ్రెస్ నేయకురాలు పద్మావతి ప్రముఖులు గోపాల్‌రెడ్డి,రామ్‌మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, రోజు పార్కుకు వచ్చే పాదచారులు, చుట్టు ప్రక్కల ప్రాంతాల వారు పాల్గొన్నారు.



బుడా అధ్యక్షుడిని సన్మానిస్తున్నఉద్యాన పదాధికారులు

ఎండల నుంచి జాగ్రత్త తీసుకోవాలి

● డీహెచ్ఓ డాక్టర్ వై.రమేష్ బాబు

బళ్లారి గాంధీనగర్, మార్చి 6: ఈ వేసవిలో విపరీతమైన వేడి, వడగా ల్పులు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని కనుక ప్రజలు ముందు జాగ్రత్త చర్యగా అవసరమైన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపా డుకోవాలని జిల్లా కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వై.రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వేడితాపం నుండి ఉపశమనం పొందడానికి అవస రమైన సలహాలు సూచనలు తెలిపారు. బయటకు వెళ్ళేవారు లూజుగా ఉండే బట్టలు ధరించాలని, అవసరమైన మేరకు తాగునీటిని దగ్గరగా ఉంచుకోవా లని, తరచూ ఉప్పు, చక్కెర మిశ్రమంతో కూడిన నీటిని, పండ్ల రసాలను సేవించాలని, వేడి తాపాన్ని తగ్గించే మజ్జిగ లాంటివి సేవిస్తూ వేడి తాపం నుండి శరీరాన్ని కాపాడుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా పరిధి లోని అన్ని సార్వజనిక సముదాయ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వేసవి ప్రభావానికి గురైన వారికి అవసరమైన ఓఆర్ఎస్, ఐవి, ఫ్లూయిడ్స్, జీవరక్షక ఔషధాలు, నిలువ ఉంచాలని ఆయా తాలూకా ఆరోగ్య అధికారులకు సూచించారు. వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో తాగునీటి సరఫరా చేసే ట్యాంకు ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించే దిశగా అధికారులు కృషి చేయాలని డిహెచ్ఓ డాక్టర్.వై.రమేష్ బాబు ప్రకటనలో వివరించారు.

తులాభారం నిధులతో మండపాల అభివృద్ధి

హెబ్బాళ్ మఠ నాగభూషణ శివాచార్యులు

కంప్లి, మార్చి 6 : గ్రామాల్లో భక్తాదులు తమపై నమ్మకం వుంచి తులా భారం ద్వారా డబ్బుతో తమ మొక్కులు సమర్పించుకుంటున్నారని, అలా వచ్చిన డబ్బుతో మండపాల అభివృద్ధి చేపడతామని హెబ్బాళ్ మఠ నాగభూ షణ శివాచార్యులు తెలిపారు. తాలుకా పరిధిలోని సన్నాపురం గ్రామంలో బుధవారం హెబ్బాళ వీరభద్రేశ్వర జాతర సందర్భంగా, శరణు బసవేశ్వర పురాణం ప్రారంభం కావడంతో ఆయనకు సన్నాపురం గ్రామ భక్తాదులు, ప్రజలు తులాభారం తూచారు. ఈ సందర్భంగా వీరభద్రేశ్వర దేవస్థానం సేవా సమితి ప్రముఖులు మూకయ్యస్వామి మాట్లాడుతూ చిక్కినకొప్ప చిన్న శరణ స్వామి పూజలు చేయడం వల్ల ప్రతి యేటా సమృద్ధిగా వర్షాలు, మంచి దిగు బడులతో సుఖశాంతులతో ప్రజలు జీవిస్తున్నారన్నారు. అలాగే హెబ్బాళ్ వీరభద్రేశ్వర ఆశీర్వాదంతో ఈ ఖరీఫ్, రబీ పంటలు కూడా తీసుకున్నామని తెలిపారు. సుమారు 421 మంది మహిళలకు ఒడినింపే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దిండూరు వీరేశప్ప,శరణప్ప, మల్లయ్య, మణి కాంత, చెన్నప్ప పాల్గొన్నారు.



తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

బసవేశ్వరస్వామికి మొక్కు చెల్లించుకున్న విజయనగర డీసీ



నళ్లి గ్రామం నుంచి కొట్టూరుకు నడిచి వెళుతున్న జిల్లా అధికారి దివాకర్

కంప్లి, మార్చి 6 : విజయనగర జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ బుధవారం కే హళ్లి గ్రామం నుంచి కొట్టూరుకు ఏడు కిలోమీటర్లు నడిచి కొట్టూరు బసవేశ్వరస్వామికి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మానవ జన్మలో తమ విధులపై ఏవిధంగా దృష్టిసారిస్తారో దైవంపై కూడా అలాగే దృష్టి సారించాలని అప్పుడే మనలో ప్రశాంతత నెలకొంటుందన్నారు. కలియుగ ఆరాధ్య దైవమైన కొట్టూరు బసవేశ్వరస్వామి అందరికీ ఆరాధ్యదైవమన్నారు. ఇది విజయనగర జిల్లాలోనే పేరు గాంచిన దేవా లయమన్నారు. రథోత్సవం సందర్భంగా భక్తాదులు ఎంతో మంది నడుస్తూ వచ్చి స్వామి వారికి మొక్కులు సమర్పించుకోవడం అందరికీ తెలిసిందేనన్నారు. తాను కూడా ఒక భక్తుడిగా కే నళ్లి గ్రామంనుంచి కొట్టూరుకు పాదయాత్ర చేపట్టి స్వామివారికి మొక్కులు సమర్పించు కుని పూజలు నిర్వహించినట్లు తెలిపారు. మొన్న జరిగిన రథోత్సవాన్ని భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించామన్నారు. లక్షల కొద్దీ భక్తాదుల మధ్య రథోత్సవం జరిగిందన్నారు. ప్రతి యేటా కూడా ఈ రథోత్సవం మరింత వైభవంగా జరుపుకునేందుకు భక్తులు ముందుకువస్తున్నారని తెలిపారు.

11,12 తేదీల్లో ఆనెగొంది ఉత్సవాలు

- మంత్రి శివరాజతంగడి



ఉత్సవాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మంత్రి శివరాజతంగడి

గంగాతి రూరల్, మార్చి 6: ఈనెల 11,12వ తేదీలలో రెండు రోజుల పాటు హంపి ఉత్సవాల మాదిరిగానే ఆనేగొంది ఉత్సవాలను కూడా జరుపుకోవాలని మంత్రి శివరాజ్ తంగడి కోరారు. ఉత్సవాల సందర్భంగా బుధవారం మంత్రి బ్రోచర్ విడుదల చేసి మాట్లాడారు. ప్రజలందరు ఉత్సవాల్లో పాల్గొని విజయ వంతం చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆనేగొంది ఉత్సవాల కోసం కోట్లాది రూపాయిల నిధులను విడుదల చేసి ఈ ప్రాంత అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. ఈసందర్భంగా కొప్పళ జిల్లా డీసీ అనిల్ ఆష్టల్లా, గంగా వతి ఎమ్మెల్యే జానర్దనరెడ్డి, కుష్టగి ఎమ్మెల్యే దొడ్డనగౌడ, ఎస్పీ యశోధ వడగుట్టి తదితరులు పాల్గొన్నారు.

మూడు చక్రాల స్కూటర్లకు దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

బళ్లారి గాంధీనగర్, మార్చి 6: రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన త్రి చక్ర స్కూటర్ల పంపిణీకి సంబంధించి బుధవారం జిల్లా పంచా యతీ కార్యాలయంలో లబ్దిదారుల దరఖాస్తులను పరిశీలించినట్లు వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి గోవిందప్ప తెలిపారు. జిల్లా పరిధిలోని ఐదు తాలూకాల నుంచి 303 మంది నుంచి దరఖాస్తులు రాగా వాటిలో 210 దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో మెడికల్ పరీక్షల ఆధారంగా వంద మంది వికలాంగులకు మూడు చక్రాల స్కూటర్లను పంపిణీ చేసే అవకాశం ఉందని వివరించారు. దరఖాస్తుల పరిశీలన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ పంచాయతీ డిఎస్ గిరిజా శంకర్, డిహెచ్ఓ కార్యాలయం నుండి డాక్టర్ వీరేంద్ర కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం నుండి వీరేష్, విక లాంగుల సంక్షేమ శాఖ అధికారి గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ గోవిందరాజులు వర్ధంతి



రాజయోగి పుస్తకాన్ని విడుదల చేస్తున్న డీసీ,ఎస్పీ, మేయర్ తదితరులు

బళ్లారి సిటీ, మార్చి 6: బళ్లారి నగరంలోని కౌలుబజార్ విజయనగర కాలనీ కమతం సురేశ్ నాయుడు పార్కులో మంగళవారం ఉదయం శ్రీ రాజయోగి డాక్టర్ ఇంజేటి గోవిందరాజుల నాయుడు వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, మేయర్ శ్వేత ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన వంశస్థుడు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ముద్దుశెట్టి గోపాలకృష్ణ మాట్లాడుతూ నగరంలోని కౌల్‌బజార్ ప్రాంతంలో 1882లో జన్మించిన రాజయోగి డాక్టర్ ఇంజేటి గోవిందరాజులునాయుడు 1952లో మరణించారని, 70 ఏళ్లపాటు తన తండ్రి ఆశయ సాధనకోసం కృషిచేశారన్నారు. ఆయన చేసిన సేవలు గుర్తిండిపోయేలా పుస్తకాన్ని విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బుడా అధ్యక్షులు ఆంజనేయులు, కార్పోరేటర్లు గోవిందరాజులు,కా లనీ ప్రముఖులు ,వస్తానాయుడు, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గస్తీ తిరుగుతున్న పోలీస్ వాహనం బోల్తా



బోల్తా కొట్టిన పోలీస్ వాహనం, చికిత్సపొందుతున్న పోలీసు

రాయచూరు, మార్చి 6 : రాత్రివేళ గస్తీ తిరుగుతున్న పోలీస్ వాహనం ప్రమాదవశాత్తూ బోల్తాగొట్టింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి నగర సమీ పంలోని బైపాస్ రోడ్డు వద్ద జరిగింది. రూరల్ ఎస్ఐ ప్రకాశ్ డంబళ్, డ్రైవర్ ఇతర సిబ్బందితో కలిసి గస్తీ తిరుగుతుండగా ఎదురుగా ఓ వాహనం వేగంగా దూసుకొచ్చింది. దాన్నుంచి తప్పించు కునేందుకు చేసిన ప్రయత్నంలో పోలీసు వాహనం అదుపు తప్పింది. రోడ్డు దిగి వాహనం బోల్తా గొట్టడంతో ఎస్.ఐ ప్రకాశ్ డంబళ్‌తో పాటు డ్రైవర్ ఇతర సిబ్బందికి గాయాలయ్యాయి. వెంటనే వారిని నగ రంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. దీనిపై స్పందించిన ఎస్పీ బి.నిఖిల్ అదృష్టవశాత్తు ఎస్ఐ, సిబ్బందికి ఎలాంటి ప్రాణాపాయం కాలేద న్నారు. వేగంగా వస్తూ ప్రమాదానికి కారణమైన వాహనదారుడిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు.

హోసూరు జోన్

రథోత్సవం నాడు స్థానిక సెలవు ప్రకటించండి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

హోసూరు, మార్చి 6: హోసూరులో రథోత్సవం సందర్భంగా స్థానికంగా సెలవు ప్రకటిం చాలని, మద్యం దుకాణాలను తెరవరాదని కోరుతూ హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంకకు బీజేపీ నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈనెల 25న ప్రసిద్ధి చెందిన హోసూరు కొండపై వెలసిన మరకతాంబ చంద్రచూడేశ్వర ఆలయ జాతరలో భాగంగా రథో త్సవం జరగనుంది. ఈ ఉత్సవాలకు తమిళనాడు నుంచే కాక సరిహద్దులోని కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారన్నారు. కావున భక్తుల రద్దీ దృష్ట్యా స్థానికంగా సెలవు ప్రకటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేం దుకు 25 నుంచి 27వ తేదీ వరకు మద్యం దుకాణాలను తెరవకుండా చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. సబ్ కలెక్టర్‌ను కలసిన బృందంలో బీజేపీ కార్యవర్గ సభ్యులు మురుగన్, ప్రవీణ్ కుమార్, రాజశేఖర్, కరుణానిధి, కుమార్, వీరేంద్ర, ఓం, మణికండన్ పాల్గొన్నారు.

పన్ను చెల్లించని దుకాణాలకు సీల్

హోసూరు, మార్చి 6: హోసూరు కార్పొరేషన్ పరిధిలో 45 వార్డులలో వేల సంఖ్యలో దుకాణాలు, వాణిజ్య సంస్థలు పనిచేస్తున్నాయి. బాగలూరు రోడ్డు, బస్‌స్టేషన్ ఎదురుగా, పాత బస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లోని పలు దుకాణాలు కార్పొరేషన్‌కు అద్దె, పన్ను చెల్లించడం లేదు. కార్పొరేషన్ తరపున పలుమార్లు నోటీసులు పంపినా డబ్బులు చెల్లించలేదు. దీంతో బుధవారం హోసూరు కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ టిటో ఆధ్వర్యంలో అధికారులు ఆయా ప్రాంతాల్లోని పన్ను చెల్లించని దుకాణాలకు సీల్ వేశారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

పాఠశాలకు డెస్కులు, బెంచీల అందజేత

హోసూరు(సిఫ్‌కాట్), మార్చి 6:హోసూరు నగరపాలక సంస్థ పరిధిలోని అందివాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం శాసనమండలి అభివృద్ధి నిధి నుంచి రూ.5.58 లక్షలతో డెస్కులు, బెంచీలు సమకూర్చారు. హోసూరు ఎమ్మెల్యే వైప్రకాశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు టేబుళ్లు, బెంచీలు కుర్చీలను అందజేశారు. బుధవారం ఏర్పాటైన ఈ కార్యక్రమానికి పన్నులు, ఆర్థికస్థాయి సమితి చెన్నీరప్ప అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, మున్సిపాలిటీ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అసోసియేషన్, పాఠశాల మేనేజర్లు, కమిటీ అధ్యక్షులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్ తదితరులు

కృష్ణానది వంతెనపై ద్విచక్రవాహనాల ఢీ

●నలుగురు యువకులకు గాయాలు



గాయాలపాలైన యువకులు

రాయచూరు, మార్చి 6 : ఐదు రోజుల క్రితం తిరిగి ప్రారంభమైన కృష్ణనది వంతెన పై మంగళవారం రాత్రి రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలపై వెళుతున్న నలుగురు యువకులు గాయాలపాలైనట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో బుధవారం ఇద్దరిని బళ్ళారి మిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన స్థలం రాష్ట్ర సరిహద్దుకు ఆవల వైపు తెలంగాణ ప్రాంతంలో జరగడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

మహాశివరాత్రి సందర్భంగా రాయచూరులో శాంతియాత్ర

రాయచూరు, మార్చి 6 : మహాశివరాత్రి పర్వదినం సంద ర్భంగా నగరంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాల యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బ్రహ్మకుమారి స్మితాఅక్క తెలిపారు. నగరంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తొలిసారి ఈ ఏడాది మహాశివరాత్రి రోజు 40 అడుగుల మహాలింగాన్ని ఏర్పాటు చేసి ధ్వజారోహణ చేస్తామ న్నారు. అదే రోజు అంతర్జాతీయ మహిళ దినోత్సవం కావడంతో మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమం ఉంటుందన్నారు. మహాశివ రాత్రి సందర్భంగా ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి రోజు నగరంలో శాంతియాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి పర్వదినానికున్న విశి ష్టత తదితర అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేం దుకు 8వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు తాము ప్రత్యేక కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న బ్రహ్మకుమారి స్మితాఅక్క

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

టీవీ శంకర నారాయణన్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత తిరువలంగాడు వెంబు అయ్యర్ శంకరనారాయణన్ 1945 మార్చి 7న తంజావూరు జిల్లా మైలాదుత్తురై (మాయవరం లేదా మయూరం) జన్మించారు. కర్ణాటక శాస్త్రీయ సంగీత కళాకారుడు. దేశ విదేశాలలో పలు కచేరీలు నిర్వహించడమే కాక ఆల్బమ్స్‌ను రూపొందించారు. మద్రాస్ మ్యూజిక్ అకాడమీ నుంచి సంగీత కళానిధి, గాయక శిఖా మణి, విద్యా తపస్వి, సంగీత నాటక అకాడమీ అవార్డులు పొందారు. 2022 సెప్టెంబరు 2న కన్నుమూశారు.

పరమహంస యోగానంద (వర్ధంతి)



పరమహంస యోగానంద 1893 జనవరి 5న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌లో జన్మించారు. ఆయన అసలు పేరు ముకుంద్‌లాల్ ఘోష్. సన్యాసి, యోగి, గురువుగా పేరొందారు. ధ్యానం, క్రియా యోగా ద్వారా సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ (ఎస్ఆర్ఎఫ్), యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా (వైఎస్ఎస్) సంఘాలను ఏర్పాటు చేసి చైతన్యం కల్పించారు. 32 ఏళ్లపాటు అమెరికాలో నివసించి అక్కడ కూడా యోగాను విస్తృతం చేశారు. 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఏ యోగి' అనే పుస్తకాన్ని ప్రచురించగా 20వ శతాబ్దంలో వంద ఆధ్యాత్మిక పుస్తకాలలో ఒకటిగా నిలిచింది. 1952 మార్చి 7న కన్నుమూశారు.

వివియన్ రిచర్డ్స్ (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ వివియన్ రిచర్డ్స్ 1952 మార్చి 7న ఆంటిగ్వా దేశ రాజధాని సెయింట్ జాన్స్‌లో జన్మించారు. పూర్తి పేరు సర్ ఐజాక్ వివియన్ అలెగ్జాండర్ రిచర్డ్స్. వెస్ట్ ఇండీస్ తరపున క్రికెట్‌లో పేరొందారు. 2002లో వన్డేలలో ఆల్‌టైమ్ బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా నిలిచారు. సర్ బ్రాడ్‌మన్, సచిన్ టెండూల్కర్‌ల తర్వాత ఆ స్థాయిలో గుర్తింపు పొందారు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాక అప్పుడప్పుడు వ్యాఖ్యాతగా, టీమ్ మెంటార్‌గా వ్యవహరిస్తున్నారు. ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్నారు.

అనుపమ్ ఖేర్ (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో పేరొందిన నటుడు 'పద్మభూషణ్' గ్రహీత అనుపమ్‌ఖేర్ 1955 మార్చి 7న పంజాబ్ రాష్ట్రం సిమ్లాలో (ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్‌లో ఉంది) జన్మించారు. హిందీలో 500కు పైగా సినిమాలలోనూ, పలు నాటకాలలో నటించారు. క్యారెక్టర్ నటుడిగా, కమెడియన్‌గా పేరొందారు. దర్శకుడిగా, నిర్మాతగాను రాణించారు. రెండు జాతీయ ఫిల్మ్ అవార్డులు, 8 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలతోపాటు ఉత్తమ హాస్యనటుడిగా ఐదు సార్లు అవార్డులు పొందారు. సెన్సార్‌బోర్డు, ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాకు చైర్మన్‌గా వ్యవహరించారు. బఫ్టా పురస్కారానికి నామినేట్ అయ్యారు. అంతేకాక కొన్ని పుస్తకాలు కూడా రచించారు. 2021లో హిందూ యూనివర్సిటీ ఆఫ్ అమెరికానుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి

చేళూరు, మార్చి 6: ప్రస్తుత సమాజంలో ఆత్మరక్షణకోసం కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కరాటే మాస్టర్ శ్రీనివాసన్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని సోమనాథపురలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కరాటేలో తర్ఫీదు ఇచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రత్యేకించి విద్యార్థినులు, యువతులు కరాటేను నేర్చుకోవడం ద్వారా ఆకతాయిల వేధింపుల బారినుంచి రక్షించుకోవచ్చునన్నారు. మరొక కరాటే మాస్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కరాటేను నేర్చుకోవడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాల బారినుంచి బయటపడవచ్చునన్నారు. ఈ సందర్భంగా మంజునాథ్, శ్రీనివాస్, హనుమప్ప, మానస, సుమన్ పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందజేస్తున్న రాఘవేంద్ర

బొమ్మనహళ్ళి, మార్చి 6: వంగవ్వన పాళ్యలోని ఎంఆర్ఆర్ రాయల్ పబ్లిక్ స్కూల్‌లో ఇటీవల జరిగిన పరీక్షా ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ రాఘవేంద్ర నేతృత్వంలో బుధవారం ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ నాలుగైదేళ్లుగా తమ పాఠశాల అభివృద్ధి పథంలో సాగుతోందని క్రమశిక్షణ, మెరుగైన విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. పాఠాలతోపాటు ఆటపాటల్లోనూ, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. ఇదే సందర్భంగా రాఘవేంద్ర పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రముఖులు దిలీప్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెదురుతోటలో ఆకస్మిక మంటలు

శిడ్లఘట్ట, మార్చి 6: భద్రన చెరువుకు అనుబంధంగా ఉండే వెదురుతోటలో మంటలు తలెత్తడంతో సుమారు 10 ఎకరాల మేర భస్మీపటలమైంది. తాలూకాలోని కాకచొక్కండహళ్ళి, అంకతట్టి నుంచి జే వెంకటాపుర వరకు భద్రన చెరువు ఉంది. చెరువు సమీపంలో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో వెదురుతోట ఉంది. మంటలు ఒక్కసారిగా తలెత్తడంతో పొగ ఆవరించింది. గమనించిన స్థానికులు వెంటనే అటవీ, అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. శిడ్లఘట్ట, దేవనహళ్ళి, చిక్కబళ్ళాపురకు చెందిన 40మంది అగ్నిమాపకసిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను నియంత్రించారు. ఏడెనిమిది గంటలపాటు శ్రమించారు. వేసవి ప్రారంభం కావడంతో అటవీప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖకు సహకరించాలని ప్రాంతీయ అటవీ అధికారి సుధాకర్ కోరారు.

తెలుగు పాఠశాలలను కాపాడుకుందాం



హాజరైన విద్యార్థులు



వేదికపై ప్రముఖులు

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో స్థిరపడిన ప్రవాసాంధ్రులు సాధ్యమైనంతవరకు తమ పిల్లల్ని తెలుగు పాఠశాలల్లో చేర్పించి చదివించాలని యలహంకలోని నీలకంఠేశ్వర తెలుగు కన్నడ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి వై వెంకట నారాయణ పిలుపునిచ్చారు. యలహంక ఓల్డ్‌టౌన్‌లోని ఈ పాఠశాల వార్షికోత్సవం, సరస్వతి పూజా కార్యక్రమాలు బుధవారం ఉత్సాహభరితంగా జరిగాయి. కార్యక్రమంలో ప్రసంగించిన వెంకట నారాయణ నగరంలో గతంలో డజన్ల కొద్దీ తెలుగు పాఠశాలలు ఉండేవని ఇప్పుడు వీటి సంఖ్య బాగా తగ్గిందని ఇవి కనుమరుగు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రవాసాంధ్రులపై ఉందన్నారు. ఈ పాఠశాలకు నూతన సమితి బాధ్యతలు చేపట్టిన తర్వాత పాఠశాల వాతావరణం మారిందన్నారు. దాతల సహకారంతో విద్యార్థుల సంఖ్య పెరిగిందని తెలుగు మాధ్యమంలో తమ పిల్లలను చేర్పించేందుకు స్థానిక చేనేతకారులు ముందుకు వస్తున్నార న్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఈ సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు కె.నాగరాజు, కోశాధికారి చంద్రశేఖర్, పదాధికారులు శ్రీనాథ్, విజయ కుమారి, హరీష్‌లతో పాటు చేనేతకారుల సంఘం అధ్యక్షుడు డీ చిన్నప్ప, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్, ఉపాధ్యాయులు రాణి, నందినిలతో పాటు పోషకులు, విద్యార్థులు హాజరయ్యారు. అచ్చ తెలుగులో విద్యార్థులు చేసిన సరస్వతి ప్రార్థనలు అందర్నీ ఆకర్షించాయి. వార్షికోత్సవ కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

భయం వీడి పరీక్షలకు సిద్ధం కండి



వీడ్కోలు కార్యక్రమంలో మునీర్ అహ్మద్ తదితరులు

బాగేపల్లి, మార్చి 6: పరీక్షల వేళ మొబైల్ గేమ్స్, ఇతరత్రాకు దూరంగా ఉండడమే కాక భయాన్ని వీడి పాఠాలను చక్కగా చదివి ఉత్తమ మార్కులు పొందడం ద్వారా తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తేవాలని గ్రామ ప్రముఖుడు మునీర్ అహ్మద్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పరీక్షలంటే భయం వీడి శ్రద్ధగా చదవాలని, ఆత్మవిశ్వాసం కోల్పోరాదన్నారు. సాధ్యమైన మేరకు వేకువజామున నిద్ర లేచి పాఠాలను రివిజన్ చేసుకోవడం సముచితమన్నారు. ఆయా సబ్జెక్టులకు అనుగుణంగా నిరంతర అభ్యాసంతో పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చునన్నారు. ఉన్నత లక్ష్యం దిశగా శ్రమించాలన్నారు. నైతిక విలువలను, మానవ సంబంధాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గురువులు, పెద్దలను గౌరవించాలన్నారు. ఉపాధ్యాయుల శ్రమ, ప్రోత్సాహం గుర్తించి చక్కగా చదువుకోవాలన్నారు. కాగా తల్లిదండ్రులు కూడా పిల్లల వ్యక్తిత్వ నిర్మాణంలో జవాబ్దారీ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, సభ్యుడు షఫీవుల్లా, జమీయ్యత్ ఏ ఉలమా కర్ణాటక సంఘం తాలూకా అధ్యక్షుడు రిజ్వాన్ అహ్మద్, ఉపాధ్యాయులు ముబీనా, అనిసా ఫాతిమా, రిజ్వాన్‌తాజ్, భీమేశ్, వెంకటరామప్ప తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీలో శిక్షణ



శిబిరంలో పాల్గొన్న మహిళలు

శిడ్లఘట్ట, మార్చి 6: తాలూకాలోని బోధగూరు గ్రామంలో చిరుధాన్యాలను ఉపయోగించి చేసే ఆహార పదార్థాల తయారీ శిక్షణ శిబిరాన్ని మహిళలకు ప్రత్యేకంగా నిర్వహించారు. మహిళలు స్వావలంబన దిశగా సాగేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా శిబిరాన్ని నిర్వహించినట్టు 'ఆలిండియా కో-ఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఆన్ ఉమెన్ ఇన్ అగ్రికల్చర్ సంఘం ముఖ్యురాలు డాక్టర్ ఉషా రవీంద్ర తెలిపారు. బెంగళూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం సహకారంతో నైపుణ్యాభివృద్ధి తరగతులు కొనసాగుతున్నాయని, స్థానికంగా లభించే సిరిధాన్యాలతో నాణ్యమైన ఎలాంటి ఆహార పదార్థాలను సిద్ధం చేసుకోవచ్చో అవగాహన కల్పించడమే కాక ప్యాకింగ్, లేబులింగ్, మార్కెటింగ్ గురించి తెలియచేస్తున్నామన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ జిల్లా ఐఎస్ఓ, పాక శాస్త్ర నిపుణురాలు వీణా ప్రమోద్ మాట్లాడుతూ మహిళలు ఆహార ఉత్పత్తుల తయారీ రంగంలో రాణించే అవకాశం ఉందని, ఆయా ఉత్పత్తులకు సంబంధించి ఇందుకు ఎలాంటి పదార్థాలు ఉపయోగించాలో వివరించారు. దాల్ మిక్స్, సామ బియ్యంతో బిరియాని మిక్స్, రసం పొడి, కూరగాయల గొజ్జు, టమోటా రసం పేస్ట్, పలు తృణధాన్యాలతో మిక్స్‌డ్ రకం తయారీ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేంద్రీయ సాగు నిపుణుడు వెంకటస్వామిరెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ గీతా ఎం యంకంచి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు రసిక, కోశాధికారి వసుదా మహేశ్, గ్రామానికి చెందిన మహిళలు మాణిక్యమ్మ, రేఖా, సుమంగల, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



దళిత రక్షణావేదిక ఆధ్వర్యంలో నిరసన

మహదేవపుర, మార్చి 6: బెంగళూరు తూర్పు తాలూకా వర్తూరు హోబళి భోగనహళ్ళి గ్రామంలో స్మశానం, ఆలయాన్ని నేలమట్టం చేసి సదరు స్థలాన్ని ఆదర్శ డెవలపర్స్ ఆక్రమించుకుందని ఆరోపిస్తూ కర్ణాటక దళిత రక్షణా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సొరహుణసె వెంకటేశ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. బీబీఎంపీ మహదేవపుర ప్రాంతీయ కార్యాలయం వద్ద నిరసనలో వందలాదిమంది కార్యకర్తలు పాల్గొన్నారు. సర్వే 33/1లో 1 ఒకరా 39 కుంటలలో స్మశానం ఉందని, ఇక్కడ అంగాళపరమేశ్వర దేవాలయం ఉండేదన్నారు. గ్రామస్థులు శవసంస్కారాలు నిర్వహించిన అనంతరం ఇక్కడి ఆలయాన్ని సందర్శించే ఆనవాయితీ ఉందన్నారు. అయితే సదరు స్థలాన్ని ఆదర్శ డెవలపర్స్ సంస్థ ఆక్రమించిందని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా సర్వేకు ఆదేశించారన్నారు. 1 ఎకరా 39 కుంటల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినవారిపై చర్యలు తీసుకోవాలని, స్మశానికి ప్రహరీగోడ నిర్మించాలన్నారు. కాగా మహదేవపుర నియోజకవర్గంలో పలు చోట్ల నీటి సమస్య ఉందని, ట్యాంకర్లే శరణ్యమయ్యాయన్నారు. కొంతమంది ప్రైవేట్ ట్యాంకర్ల నిర్వాహకులు ఇదే అదునుగా దందా సాగిస్తున్నారన్నారు. ఇందుకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ప్రాంతీయ అదనపు కమిషనర్ ఇబ్రహీంకు వినతిపత్రం సమర్పించారు. నీటి సరఫరాలో విఫలమైన వార్డు ఇంజనీర్ వెంకటేశ్, సహాయక ఇంజనీర్‌లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో సంఘం ఉపాధ్యక్షుడు రామకృష్ణ, జయకుమార్, రాష్ట్ర యువవిభాగం అధ్యక్షుడు విజయకుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు సత్యవతి, ఆప్ నాయకుడు మృత్యుంజయ, భోగనహళ్ళి సురేశ్, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ విభాగం ప్రారంభం



డయాలసిస్ విభాగం, ఐసొలేషన్ వార్డు ప్రారంభంలో మంత్రి గుండూరావు, ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, మార్చి 6: పటిష్టమైన రాష్ట్ర నిర్మాణం కోసం ఆరోగ్యకరమైన మానవవనరులు అవసరమని ఈ నేపథ్యంలో ఆసుపత్రులలో అత్యాధునిక సౌలభ్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసొలేషన్ వార్డు, 12 పడకల గది, డయాలసిస్ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అన్ని విధాలా అవసరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే బంగారపేటలో 12 పడకల భవనం, ఐసొలేషన్ వార్డు ప్రారంభించామన్నారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తాలూకా అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి గురించి పలుమార్లు చర్చించారన్నారు. స్కానింగ్, రేడియాలజిస్ట్ అనుభవజ్ఞులైన వైద్యుల కొరత ఉందని కంట్రాక్టు పద్ధతిన త్వరలోనే జిల్లా, తాలూకా ఆసుపత్రులలో నియామకాలు చేపడతామన్నారు. ఎంతోకాలంగా ప్రజలు ఎదురు చూస్తున్న డయాలసిస్ విభాగం అందుబాటులోకి రావడంపై ఎమ్మెల్యే నారాయణస్వామి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 1050 లీటర్ల ఆక్సిజన్ ఉత్పాదనా సామర్థ్యం కల్గిన విభాగం ఉందని, నిత్యం 1500మందికిపైగా అవుట్‌పేషంట్‌లు చికిత్స పొందుతున్నారన్నారు. గత బీజేపీ ప్రభుత్వంలో పలుమార్లు విన్నవించినా స్పందన కరువైందని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డయాలసిస్ కేంద్రాన్ని అమలులోకి తెచ్చారన్నారు. ఈ సందర్భంగా జడ్పీ ఈఓ పద్మ బసవంతప్ప, తహసీల్దార్ రశ్మి, తాలూకా వైద్యాధికారి ప్రియదర్శిని, పాలనాధికారి భారతి, బీఈఓ సుకన్యా, సీఈఓ మీనాక్షి, డీఎస్పీ పాండురంగ సీఐ నంజప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పార్థసారథి, చందు, బూదికోటె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్జా స్టేట్ యూనివర్సిటీతో చెవలియార్ గ్రూప్ ఒప్పందం



మీడియాతో చెవలియార్ సంస్థ ప్రతినిధులు

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రష్యాలో వైద్యవిద్య చదివే విద్యార్థుల సౌకర్యార్థం దేశంలోని ప్రముఖ బహుళజాతి సంస్థ చెవలియార్ గ్రూప్, రష్యాలోని పెన్జా స్టేట్ యూనివర్సిటీతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం అనంతరం గ్రూప్ సంస్థాపకుడు, సీఈఓ యువరాజ్‌సింగ్ సోలంకి బుధవారం మీడియాతో మాట్లాడారు. రష్యాలో రెండు దశాబ్దాలపాటు అధ్యయనం చేసిన అనంతరమే ఈ కీలక ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఎంబీబీఎస్ కోసం విద్యార్థులను ఎంపిక చేయడమే కాకుండా వారి సమగ్ర వికాసానికి ఈ విశ్వవిద్యాలయం బలమైన పునాదులు వేస్తోందన్నారు. 2013 నుంచి 2023 వరకు 370మంది భారతీయ విద్యార్థులు ఈ యూనివర్సిటీలో వైద్యకోర్సును విజయవంతంగా పూర్తి చేసి డిగ్రీలు పొందారన్నారు. మీడియా సమావేశంలో చెవలియార్ మేనేజింగ్ డైరెక్టర్ క్షత్రదారి మండల్‌తోపాటు పెన్జా స్టేట్ యూనివర్సిటీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మొబైల్ సెక్యూరిటీ సొల్యూషన్స్‌కు శ్రీకారం



మీడియాతో సంస్థ ప్రతినిధులు

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన 63 మూన్స్ టెక్నాలజీస్ లిమిటెడ్, మొబైల్ సెక్యూరిటీ సొల్యూషన్స్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా దేశంలోని రూ.80కోట్ల మొబైల్ ఫోన్ మార్కెట్‌లోకి తన నూతన ఆవిష్కరణను ప్రవేశపెట్టింది. సైబ్ ఎక్స్‌టీఎం పేరిట రూపొందించిన ఈ సాంకేతికత 63 ఎస్ఏట్ ఎక్స్‌టీఎం ద్వారా పని చేస్తుందని సంస్థ ప్రతినిధులు బెంగళూరులో బుధవారం మీడియా సమావేశంలో తెలిపారు. మొబైల్ సెక్యూరిటీ రంగంలో ఇదొక విప్లవాత్మక పరిణామమన్నారు. ప్రపంచంలోని 10 ప్రముఖ సైబర్ సెక్యూరిటీ సంస్థల సాంకేతికతను అధ్యయనం చేసిన అనంతరమే దీనికి రూపకల్పన చేశామన్నారు. 2029 నాటికి సైబర్ సెక్యూరిటీ గాత్రం రూ.లక్ష కోట్లకు చేరుకోవచ్చునని అంచనా వేస్తున్నామన్నారు.

ఏడు విశ్వవిద్యాలయాలకు రూ.50లక్షల చొప్పున ప్రోత్సాహం

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో ఉత్తమ సాధన నమోదు చేసిన 7 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు తలా రూ.50 లక్షల చొప్పున ప్రోత్సాహధనం ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వం నగరంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉత్తమ పరీక్షా విభాగం కేటగిరీలో బెంగళూరు విశ్వవిద్యాలయానికి, అత్యున్నత ఉద్యోగావకాశాలు, బెస్ట్ ప్లేస్‌మెంట్ విభాగంలో మైసూరు విశ్వవిద్యాలయానికి, అనుబంధ కళాశాలలకు అత్యుత్తమ మార్గదర్శకత్వం విభాగంలో ధార్వాడ విశ్వవిద్యాలయానికి ఈ ప్రోత్సాహకాలు దక్కాయి. కాగా ఉత్తమ ఇ-పాలనా విభాగంలో మంగళూరు విశ్వవిద్యాలయం, పాలనా మండలితో అత్యుత్తమ సంబంధాలు విభాగంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, ఉత్తమ సిబ్బంది అభివృద్ధి పథకాల విభాగంలో దావణగెరె విశ్వవిద్యాలయానికి, పరిశ్రమల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్ విభాగంలో రాణిచెన్నమ్మ వివిలకు దక్కాయి.

10న మల్లేశ్వరం కో-ఆపరేటివ్ బ్యాంకు శతాబ్ది ఉత్సవం



మీడియాకు వివరాలను అందజేస్తున్న బ్యాంకు పదాధికారులు

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు మల్లేశ్వరంలోని ఒక చిన్న గదిలో 1920 జూన్ 20న ప్రారంభమైన మల్లేశ్వరం కో-ఆపరేటివ్ బ్యాంకు వందేళ్ళ మజిలీని విజయవంతంగా పూర్తి చేసు కుంది. బ్యాంకు శతాబ్ది ఉత్సవాన్ని ప్యాలెస్ మైదానంలోని త్రిపుర వాసినిలో ఆదివారం ముఖ్యమంత్రి సిద్ద రామయ్య లాంఛనంగా ప్రారంభించనున్నారు. సహకార శాఖా మంత్రి కేఎన్ రాజణ్ణ, న్యాయ శాఖా మంత్రి కె.హెచ్.పాటిల్, బెంగళూరు ఉత్తర లోక్‌సభ సభ్యుడు డివి.సదానందగౌడ, మాజీ ఉప ముఖ్యమంత్రి, మల్లేశ్వరం ఎమ్మెల్యే డాక్టర్ సీఎన్ అశ్వత్థ నారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మల్లేశ్వరం సహకార బ్యాంకు అధ్యక్షుడు బీ రమేష్‌తో పాటు పదాధికారులు కార్యవర్గ సభ్యులు బుధవారం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం తమ బ్యాంకుకు రాజాజినగర, వయ్యా లికావల్, యశ్వంతపుర, గంగానగర, ఆర్‌పిసి లేఅవుట్‌లలో శాఖలు ఉన్నాయని 19,161 మంది సభ్యులు దాదాపు లక్ష మంది ఖాతాదారులున్నారని చెప్పారు.

నేత్ర విజ్ఞాన రంగంలో రోచె ఫార్మా మైలురాయి

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నియోవాస్కులర్, ఆర్ద్ర మాక్యులర్, డయాబెటిక్ మాక్యులర్ ఎడిమా చికిత్సల ప్రక్రియను మరింత సులభతరం చేసేలా వభైస్మో సాంకేతికతను రోచె ఫార్మా ఇండియా అందుబాటులోకి తీసుకొచ్చింది. సంస్థ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ వీ సింప్సన్ ఎమ్మాన్యుయేల్ వీటి విశేషాలను బుధవారం మీడియాకు తెలిపారు. నేత్ర చికిత్సా రంగంలో ఇదొక మైలు రాయి కానుందని ఆయన పేర్కొన్నారు. కంటి రెటీనా పరిస్థితి దెబ్బతీసి దృష్టి సమస్యలు సృష్టించే రెండు ప్రధాన రుగ్మతలకు ఇది బ్రేక్ వేస్తుందన్నారు. ఇది ఆంజియో పొయెటిన్, ఎండోథీలియల్ తీవ్రతను అరికడుతుందన్నారు. ఈ వైద్య చికిత్సా ప్రయోగం నేత్ర సమస్యలను బాగా తగ్గించనుందన్నారు. విస్తృత పరిశోధనల అనంతరం దీనికి రూపకల్పన జరిగిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 300 మిలియన్ల మంది, భారత దేశంలో 11 మిలియన్ల మంది రెటీనా దృష్టి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వీరికి ఈ తాజా చికిత్సా విధానం వరప్రసాదం కానుందన్నారు. మీడియా సమావేశంలో రోచె ఫార్మా భారత వ్యవహారాల వైద్యనిపుణుడు డా.విరాజ్ సువర్ణ, నారాయణ నేత్రాలయ విట్రో రెటీనా సేవల ఇన్‌చార్జి డాక్టర్ చైత్రా జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

దేవికుంటె గ్రామంలో పోస్టల్‌శాఖ



పోస్టల్‌శాఖ ప్రారంభంలో అధికారులు, ప్రముఖులు

బాగేపల్లి, మార్చి 6: పోస్టల్‌శాఖ ఇంకా తన ప్రాధాన్యతను ప్రజలలో నిలుపుకుందని కోలారు పోస్టల్ విభాగం సహాయక అధికారి కేవీ నంజుండరాజు అభి ప్రాయ పడ్డారు. తాలూకాలోని దేవికుంటె గ్రామంలో నూతనశాఖను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సౌలభ్యం, స్పీడ్‌పోస్ట్, పాస్ పోర్ట్ సేవలు, ఆధార్ నమోదు, అప్‌డేట్ తదితర సేవలు లభిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా మార్గానకుంటె గ్రామపంచాయతీ అధ్యక్షురాలు కళావతి, ఉపాధ్య క్షురాలు గౌతమి, గౌరిబిదనూరు పోస్టల్ ఉపవిభాగం అధికారి కే హనుమంతయ్య, గ్రామపంచాయతీ సభ్యుడు డీసీ శ్రీనివాస్, టీచర్ వనమాలి వీ రామన్, పోస్టల్ అధికారి జీఎన్ కృష్ణప్ప, మార్గానుకుంటె పోస్టల్‌శాఖ అధికారి అశ్వత్ నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బర్త్‌డే పేరుతో ఆహ్వానించి... కుమార్తె ప్రియుడి దారుణహత్య

బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కుమార్తెను ప్రేమిస్తున్న యువకుడిని బర్త్ డే పేరుతో ఇంటికి ఆహ్వానించి ఏకంగా దారుణంగా హత్యచేసిన సంఘటన కలబురగి పట్టణం సరస్వతీపురంలో చోటుచేసుకుంది. బీఎస్సీ నర్సింగ్ రెండో సంవత్సరం చదివే అభిషేక్‌కు అదే ప్రాంతానికి చెందిన బాలికతో ప్రేమ కొనసాగుతుండేది. బాలిక కుటుంబీకులు ఇరువురిని హెచ్చరించినా వీరిలో మార్పు కనిపించలేదని నిర్ధారించుకున్నారు. ఈనెల 3వ తేదీ ఆదివారం ఇంట్లో బర్త్‌డే ఉందని బాలిక ద్వారానే అభిషేక్‌ను రప్పించుకున్నారు. బాలిక నుంచి పిలుపు రావడంతో అభిషేక్ ఉత్సాహంగా వెళ్ళారు. అక్కడ బర్త్‌డే వేడుకకు సంబంధించిన ఆనవాళ్ళు కనిపించలేదు. అంతలోనే కుటుంబ సభ్యులంతా కలిసి ప్రేమ విషయాన్ని మరోసారి ప్రస్తావించారు. అంతలోనే ఓ గదిలోకి తీసుకెళ్ళి ఐరన్ రాడ్‌తో చితకబాదారు. రెండుగంటలకు పైగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై స్పృహ కోల్పోయారు. బాలిక అభిషేక్‌ను వదిలిపెట్టాలని వేడుకున్నా వదులలేదు. రాత్రి పొద్దుపోయాక పట్టణానికి సుదూరంగా నిర్జనప్రదేశంలో పడేసి వెళ్ళిపోయారు. గుర్తించిన వారు మెడికల్ కళాశాల ఆసుపత్రిలో చేర్పించారు. మంగళవారం చికిత్సలు ఫలించక అభిషేక్ మృతి చెందారు. విశ్వవిద్యాలయ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కాగా దాడికి కారకులైన అనిల్ రాథోడ్(42), సంతోష్‌రాథోడ్(34), సాగర్‌జాధవ్(27), హేమంత్ రాథోడ్ (34)లను అరెస్టు చేశారు. అభిషేక్ కుటుంబీకులు బుధవారం ఆందోళన చేశారు. ప్రేమ విషయం మాకు తెలిపి ఉంటే బుద్ధి చెప్పి కట్టడి చేసేవారమని అయితే ఏకంగా ప్రాణాలు తీశారని వారికి కఠినశిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే వర్సెస్ ఏడీసీసీబీ మాజీ చైర్మన్

పామిడి, మార్చి 6: పట్టణంలో బుధవారం నిర్వహించిన ఆసరా చెక్కు పంపిణీ సభ మాటల యుద్ధానికి వేదికైంది. గుంతకల్లు వైసీపీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి, అదే పార్టీకి చెందిన అనంతపురం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఏడీసీసీబీ) మాజీ చైర్మన్ వీరాంజనేయులు మాటల యుద్ధానికి దిగారు. పామిడి పట్టణంలోని ఫారెస్టు బంగ్లా సమీపానగల ఖాళీ స్థలంలో వైఎస్ఆర్ ఆసరా 4వ విడత చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని మండల అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభిస్తారని తెలిపారు. ఆ మేరకు మహిళలు ఉదయం 9.30 గంటలకే సమావేశ స్థలం వద్దకు చేరుకున్నారు. సభాప్రాంగణానికి ఏడీసీసీబీ మాజీ చైర్మన్ వీరాంజనేయులు.. తన కుమార్తె బ్యాంకు ప్రస్తుత చైర్‌పర్సన్ లిఖిత, అనుచరులతో కలిసి మధ్యాహ్నం 12 గంటలకు చేరుకున్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి మధ్యాహ్నం 12.50 గంటలకు వచ్చారు. ఇప్పటికే ఆలస్యమైందనీ, వక్తలు కాకుండా తానే నాలుగు మాటలు మాట్లాడి ముగించేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. దీనిపై ఏడీసీసీబీ మాజీ చైర్మన్ వీరాంజనేయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద సభలో సీఎం గురించి, ప్రభుత్వం గురించి మహిళలను మాట్లాడనీయకుండా ఒక్కరే ప్రసంగించి, ఎలా ముగిస్తారని నిలదీశారు. 'ఇలా మాట్లాడడం బాగుండదు, నువ్వు దిగిపో..' అని ఎమ్మెల్యే అనడంతో మాటామాటా పెరిగి వాగ్వాదం తలెత్తింది. 'నా కుమార్తె, ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖితను మాట్లాడనీయకూడదన్నదే మీ ఉద్దేశమనీ, మహిళల సమావేశంలో మహిళలను అవమానించడం ఏంట'ని వీరాంజనేయులు ప్రశ్నించారు. 'నువ్వెందుకు వచ్చావు.. గొడవ చేసేందుకే వచ్చావా.. ఇక్కడి నుంచి వెళ్లిపోమం'టూ ఎమ్మెల్యే గట్టిగా వారిస్తూ చీదరించారు. గంటల తరబడి ఆలస్యంగా వచ్చి మహిళలను మాట్లాడనీయకుండా చేస్తారా అని వీరాంజనేయులు మండిపడ్డారు. తాను కూడా వైసీపీ నాయకుడినేననీ, ప్రొటోకాల్ తమకూ వర్తిస్తుందనీ, బెదిరిస్తున్నారా..? అంటూ గట్టిగా వారించడంతో వివాదం మరింత ముదిరింది. దీంతో పక్కనే ఉన్న సీఐ రాజశేఖర్‌రెడ్డి.. తన సిబ్బందిని పంపి వీరాంజనేయులును స్టేజీ నుంచి కిందకి దింపమని ఆదేశించారు.